మూ॥ ఆధారచక్రశయనే, మమేహ నిద్రాం విహాయ విచలన్తీం।
గీతయ ఏతాః పరమా ముపతిష్ఠన్తాం జగద్విభోః కాన్తామ్॥ 25

గీ. అస్మదాధార చక్రశయమునందు
నిదుర విడనాడి మేల్కొని కదలుచున్న
పరమ శుభధామ, త్రిజగదీశ్వరుని రామ
ప్రీతి నాలించుఁగాత! మద్గీతి రచన.

మూలాధారచక్రమను శయనము నుండి నిదుర మేల్కొని, ప్రపంచ వ్యాపారము నొనర్చుచున్న శ్రేష్ఠురాలగు పరమేశ్వరపత్నిని – నా చేత రచింపఁబడిన గీతులు భుజించుఁగాత! ఆ పరమేశ్వరకాంత – నాగీతిరచన సాదరముతో వినుఁగాక!

ఇతి శ్రీ మహర్షి రమణభగవత్పాదాన్తేవాసినో వాసిష్ఠస్య
నరసింహసూనోః గణపతిమునేః కృతౌ
ఉమాసహస్రే చతుర్థ స్తబకః॥
సమాప్తమ్ ప్రథమమ్ శతకమ్॥

ఇది శ్రీ మహర్షి రమణభగవత్పాదశిష్యుఁడు, శఠమర్షణ
సగోత్రుఁడు- శ్రీ మత్పంతుల పేరయశాస్త్రి పౌత్రుఁడు -
వేంటరామ బుధేంద్ర ద్వితీయపుత్త్రుఁడు అగు
లక్ష్మీనారాయణశాస్త్రి చేత నాంధ్రీకరింపఁబడిన
ఉమాసహస్రమను స్తోత్రకావ్యమున
ప్రథమ శతకము

( ఈ ప్రథమ శతకము తే. 10-8-1943 దీని ఆంధ్రీకరింపఁబడి తే 8-5-1946దీని శ్రీరమణ భగవానునికి వినిపించి, సమర్పింపఁబడినది.)

ఓమ్. తత్. సత్.

****



ఓం నమోభగవతే శ్రీరమణాయ
శ్రీ భారతీ దేవ్యై నమః

# ఉమాసహస్రము

(ఆంధ్రప్రభా సహితము)

## (ద్వితీయ శతకమున ప్రథమ స్తబకము)

మూ॥ శ్రీఖణ్డ చర్చామివకల్పయన్తోముహుఃకపోలేషుసఖీజనస్య।
శ్రీకణ్ఠకాన్తాహసితాంకురాణాం శ్రీమన్తికుర్వన్తుజగన్తిభాసః॥ 1

చందనలేపమును సదా సఖీజనము కపోలములఁ సంధించునదియుఁ బోలిన సర్వేశప్రియకాంతా బంధురహసి తాంకురములప్రభా పరంపర, జగతీ బృందమ్మును సౌభాగ్యాన్వితముగ నొనరించుఁగాత!

శివునికాంతయగు ఉమాదేవత యొక్క చిరునవ్వులు క్రొత్త మొలకలవలె నుండును. ఆనవ్వు మొలకలతళుకులు ఆయమ్మయొక్క సకియల చెక్కిళులందు మంచిగంధపు పూతను పూయుచున్నవి వలెనున్నవి. ఆ చిరునవ్వు మొలకల వెలుగులు లోకముల నన్నిఁటినిగూడ శ్రీమంతములుగా నొనర్చుఁగాత!

చందనలేపమున్ సఖుల – చారుక పోలములందు నిత్యమున్
బొందుగఁ గూర్చుచున్నదియుఁ బోలి వెలుంగు మహేశ్వరప్రియా
సుందర మందహాసముల శోభలు – స్మాత్మకళాలసజ్జగద్
బృందము నెల్లవేళలను శ్రీ లలితంబునొనర్చుఁ గావుతన్.

**ప్రభ** :- పర్వతరాజపుత్రి చెంతనున్న సఖీమణు లిద్దఱేయనియు వారు జయావిజయలనియు శివ పురాణము నుడువుచున్నది. పార్వతికి బాల్యమునందనేక

సఖులుగలరని కావ్యసాహిత్యము తెలుపుచున్నది. మహాకవి కాళిదాసు కుమార సంభవమున ''రేమేముహుర్మధ్యగతా సఖీనామ్'' (బహుసఖీమధ్యగతయై పార్వతి యాడుకొనియెను.) అని ప్రవచించెను గదా!.

ప్రస్తుత శ్లోకమున, 'జయావిజయల కపోలములందు' అని గాని 'బహు సఖీ జనుల కపోలములందు' అనిగాని అర్థమును గ్రహించి పురాణ – కావ్య ప్రసిద్ధులను రెంటినిగూడ సమన్వయించుకొనవచ్చును.

ఇందు 'ఇవ' అనునది ఉత్ప్రేక్షను దెలుపును. శుభ్రములగు పార్వతీ మందహాసకాంతులు – ఆమె ప్రియసఖుల కపోలములయందు గంధపు పూత పూయుచున్నవా అనునట్లున్నదని యుత్ప్రేక్షింపఁ బడినది.

పార్వతీదేవి చిరునవ్వు తళుకులు సకియల చెక్కిళులందు గంధమును పూయుచున్నవను నంశము యథార్థము కాదు. అయినను అన్యధర్మ సంబంధ నిమిత్తముననవి సఖీకపోలముల యందు గంధమును పూయుచున్నట్లు సంభావింపఁబడినది.

అన్య ధర్మ సంబంధ నిమిత్తమున నొకానొక వస్తువున కింకొక వస్తువు తోడితాదాత్మ్యమును సంభావించుట – ఉత్ప్రేక్షయని చెప్పఁబడును.

ఇచట చిరునవ్వు మొలకల తళుకులు – గంధపుపూత పూయునవిగా సంభావింపఁబడినది. అన్యమగు (ఉపమానమగు) చందనలేపమునందు శుభ్రత, శోభావహత, ఆహ్లాదకత, అను ధర్మములున్నవి. ఉపమేయమగు చిరునవ్వు మొలకలయందు గూడ ఆధర్మములుండుట వలన, ఆ చిరునవ్వు మొలకల తళుకులు– సఖుల చెక్కిళుల యందు గంధపుపూత పూయునవిగా ఉత్ప్రేక్షింపఁబడినది.

ఇట్లు – ఇందొక వస్తువున కింకొక వస్తువు యొక్క తాదాత్మ్యము చెప్పఁబడినది. కావున నిది స్వరూపోత్ప్రేక్షాలంకార మగుచున్నది.



మీఁది శ్లోకమునందున్న 'ముహుః' (మాటిమాటికి) అను పదము చేత పూర్వా పరక్రమమున వ్యాపించిన హసితాంకురములకు అంతరము = తెరపి (అవకాశము) కలుగునని భ్రమింపఁగూడదు.

ఆ నవనవోద్భేదములు (హసితాంకురములు) నిరంతరములైనను ప్రసారభంగీ సౌభాగ్యము వలన ప్రత్యేకముగా భాసించుట చేత మరలమరల, తత్సఖీజనకపోలముల యందు గంధమును పూయుచున్నట్లున్నవని సంభావింపఁ బడినది.

ఆ చిరునవ్వు మొలకల నేకములైనను ఎడతెగక ఏకరూపములై యున్నను క్రొంగ్రొత్తలై వెలుంగుచు వ్యాపించుచుండుట లోకోత్తర రామణీయక వ్యంజకమగుచుండును. 'క్షణేక్షణేయన్నవతాము పైతి తదేవరూపం రమణీయ తాయాః' (ప్రతి క్షణమునందును క్రొత్తఁ దనము నొందుటయే రమణీయతా స్వరూపము) అనిమాఘ కవి ప్రవచించెను.

సఖీ కపోలముల యందుమాహాస కాంతుల విలాసమును దెలుపుటవలన, ఆ సఖులు దేవీ సవయస్కలు, సమానాకారలు అను నంశము స్ఫురింపఁ జేయఁబడినది. దాని చేత, నవోఢయగు పార్వతి శ్రీకంఠకాంతయయిన పిమ్మట గూడ, సఖీ సహచరియేయను నంశము ధ్వనింపఁజేయఁబడినది. ఈ స్తబకమున దేవీ నవయౌవన – పరిణయ కల్యాణవార్తలే ప్రస్తావింపఁబడినవి.

మూ॥ కీర్తిర్వలక్షా కుసుమాయుధస్య
స్వర్ణాద్రికోదణ్డ జయోన్న తస్య।
దరస్మితశ్రీ ర్ద్వి రదాస్యమాతు
ర్ద్రాఘీయసీం వోవితనోతుభూతిమ్.॥ 2

బంగరు కొండ విల్లుగాఁ గలిగిన శివుని జయించుట చేత నున్నతి నొందిన పుష్పబాణుని (పూవులే యమ్ములుగాఁ గలిగిన మన్మథుని యొక్క) శుభ్రకీర్తి (కీర్తికి

హేతువు) అగు గజానన జననీ మందస్మిత ప్రభ – మీకు చిరస్థాయి యగు సంపదను విస్తరింపఁ జేయునుగాత!

**ప్రభ** :- త్రిపుర సంహారోద్యుక్తుఁడగు శివుఁడు సర్వోన్నతమగు మేరు పర్వతమును విల్లుగాఁబూనెను. కావున వ్యోమ కేశుఁడగుఁ, (ఆకాశమేజుట్టుగాఁ గలవాఁడగు) అతఁడా ధనువుకంటెనుగూడ నధికోన్నతుఁడని యూహింపవలసి యున్నది. స్వశరీర దాహము చేతనైనను పార్వతి యందు వలపుఁ గలిగించి, మహోన్నతుఁడగు నా భగవానుని జయించిన మన్మథుఁడు మహామహోన్నతుఁడగు చున్నాఁడు. మఱియు శైలధనుష్కుఁడగు మహేశ్వరుని పుష్పాయుధుఁడగు పంచశరుఁడు జయించెననునిది మన్మథున కలౌకికమగు నద్భుత ప్రభావాతిశయమును స్ఫురింపఁజేయుచున్నది. పార్వతీ మందస్మిత ప్రభయే, పంచబాణుని కీర్తికి హేతువుగాఁ జెప్పఁబడుట వలన నది యతనికంటెను గూడ నున్నతమను నంశము ధ్వనింపఁజేయఁబడుచున్నది. కుసుమాయధుని కీర్తి – వలక్షమని చెప్పఁబడినది. వలక్షమనఁగా శుభ్రమని (తెల్లనిదని) యర్థము. మన్మథుఁడు బ్రహ్మ – మొదలు పురుగు వఱకును గల త్రిలోకములను జయించును. ఆ జయించుట చేతఁగూడ తత్కీర్తికి హరవిజయముచేఁ గలిగిన శుభ్రత కలుగుట లేదు – మన్మథుఁడేలోకములను జయించెనో ఆలోకములన్నియు పార్వతీ పరమేశ్వర సంభూతములగుట చేత, తత్పరిణయ పర్యవసాయియగు జయము చేతనే రతీపతి కీర్తికిట్టి వలక్షత (తెల్లఁదనము) కలిగినదని గ్రహింపఁదగియున్నది.

శివ – శక్తియోగ రూపమగు నా పరిణయము పావనతమము. కావున నే యనంగునికీర్తి నిర్మలమగుచున్నది.

హర విజయము చేత మన్మథునకుఁ గలిగిన కీర్తికి పార్వతీ మందహసిత ప్రభయే హేతువగుచున్నది. అమ్మయొక్క చిరునవ్వు లేనియెడల – అనంగునికి హర విజయము సిద్ధించునది కాదుగదా! అయినను, హేతు హేతుమత్తులకు (కార్య కారణములకు) అభేదాధ్యవసాయమువలన, కీర్తికి హేతువుగాఁ జెప్పఁదగిన దేవీ



మందస్మిత ప్రభ–(కుసుమాయుధుని) కీర్తిగాఁ జెప్పబడినది. కావున నిది హేత్వలంకారమగుచున్నది.

''హేతు హేతుమతోరైక్యం హేతుంకేచిత్ ప్రచక్షతే''

''కారణమునకును – కార్యమునకును గల ఏకత్వమును హేతువని కొందఱు చెప్పుదురు'' అనునది హేత్వలంకార లక్షణము.

మూ॥ ప్రమథ్య మానామృతరాశివీచి
ప్రోద్గచ్ఛ దచ్ఛాచ్ఛ తుషారకల్పాః।
యుష్మాకమిచ్ఛాంవిదధత్వమోఘాం
విఘ్నేశమాతుర్దరహాసలేశాః॥ 3

శీఘ్రముగను ప్రబలముగను మథింపఁబడుచున్న పాలకడలి యొక్క కెరటములనుండి లెస్సగా వెలువడుచున్నవియు, మిక్కిలి స్వచ్ఛములును, అగు నీటితుంపరల (శీకరముల) వంటివగు గణపతిమాతృ (పార్వతీ) మందస్మిత ప్రభలు – మీయభీష్టమును విఫలము గాకుండునట్లు చేయునుగాత!

**ప్రభ**:- ఇందు గణేశ్వరమాతృ మందస్మితము స్తుతింపఁబడినది. దీని చేత – భక్తుల కభీష్టములను సిద్ధింపఁజేయు నాశీస్సులు కావింపఁబడినవి. నిర్మలములును, ప్రసన్నములును, సుఖస్పర్శములును, అగు అమృత శీకరములు – మందస్మిత ప్రభలకు పమానములుగాఁ జెప్పబడినవి. కావున, దీని చేత మందస్మిత ప్రభలకుఁ గల సుఖ స్పర్శైకవేద్యత్వమును – అదృశ్యవిలాసత్వమును ధ్వనింపఁజేయుఁ బడుచున్నది.

మూ॥ చన్ద్రాతపః కశ్చన సప్రసన్నో
మహేశనేత్రా తిథితర్పణోనః।
మనోభిలాషం సఫలీకరోతు
మహేశ్వరీహాసలవప్రకాశః॥ 4

మహేశ నేత్రములను అతిథులను తృప్తినొందించునదియు సంప్రసన్నమును, చంద్రాతప విశేషరూపమును అగు మహేశ్వరీ హాసలవ ప్రకాశము మా మనస్సునందున్న యభీష్టమును సిద్ధింపఁజేయుఁగాత!

**ప్రభ:**-అతిథులనఁగా పనిమీఁదవచ్చిన భోజనార్థులని యర్థము.

ఇందు – చంద్రాతప – హాసలవప్రకాశములకు తాద్రూప్యమును జెప్పుట వలన నిచటరూపక మలంకారమగును. అయినను మహేశ్వరీహాసలవప్రకాశమునం దారోప్యమాణమగు చంద్రాతప విశేషము – మహేశ నేత్రములను అతిథులను సత్కరించుటయందుపయోగించుట వలన పరిణామమే అలంకారమగునని గ్రహింపనగును.

సుఖశీతల – అమృతగర్భ – చంద్రాతప విశేషమగు హాసలవము చేత, మహేశ్వరలోచనముల కమృతాశనత్వము సిద్ధించునపుడు, సర్వేశ దృష్టిసంతర్పణమగు ఆహాసలవము మనోభిలాష పూరణముచే సకల తాపములను గూడ నుపశమింపఁజేయుటకు సమర్థమగునను వస్తువు – పూర్వోక్తమగు పరిణాము చే ధ్వనింపఁజేయఁబడుచున్నదని యెఱుంగునది.

మూ॥ వలక్షవక్షోజపటాఞ్చలేన
చలేనసార్ధం కృతకేలయోనః।
పురత్రయారాతికలత్రహాస
భాసోనిరాసం విపదాంక్రియాసుః॥ 5

చలించుచున్న తెల్లని వక్షోజపటాంచలముతో (ధవళోత్తరీ యాగ్రముతోఁ గూడ) పరిహాసములాడుచున్న పురత్రయారాతియగు శివుని కళత్రమగు పార్వతి యొక్క మందహాసప్రభలు మా యాపదలనన్నింటిని నివారించునుగాత!

**ప్రభ:**- ఇది యాశీరూపమగు ప్రార్థనయైయున్నది. పార్వతీదేవి యొక్క శుభ్రస్మిత కాంతులకును – శుభ్రోత్తరీయ వస్త్రచలాంచలములతో గూడి



చేయఁబడుచున్న కేళులకును- గల అనురూపతవలన నిది సమాలంకారమని చెప్పఁబడును.

''సమంస్యాదాను రూప్యేణ శ్లాఘయోగ్య స్యవస్తునః'' అని సాహిత్యదర్పణమున విశ్వనాథుని చేత – సమాలంకార లక్షణము చెప్పఁబడినది.

మూ॥ భూయాసురాయాసహరాణితాని
స్మితాని భూతేశమృగీదృశోనః।
యేషాంత్విషోబిభ్రతి దిగ్వధూటీ
గణ్డేషు కర్పూర పరాగ లీలామ్. ॥ 6

దిక్కులను కాంతల చెక్కిళులయందు కర్పూరపరాగలీలను భరించుచున్న కాంతులుగల శివసుందరీదరహాసములు మాశ్రమనపనయించునుగాక!

**ప్రభ:**- భూతములనఁగా ప్రాణులు. వానికధిపతియగు పరమేశ్వరుఁడు భూతేశుఁడు. ఆడులేడివంటి చూపులు గల కాంతమృగీదృక్కని చెప్పఁబడును. కావున ''భూతేశమృగీ దృక్కనఁగా శివసుందరి'' అను నర్థమేర్పడుచున్నది. ఇచట – స్మితకాంతులయందు కర్పూరపరాగగత లీలా పదార్థమారోపితము. కావున నిది పదార్థవృత్తి – నిదర్శనాలంకారమగుచున్నది.

అలంకారికుఁడగు దండి దీనిని లలితోపమయని చెప్పియున్నాడు.

మూ॥ కుర్వన్తుకామం సఫలం త్వ (మ) దీయం
కులాద్రికన్యా హసితాని తాని
యేషాం మయూఖైః క్రియతే సితాద్రే
రుద్యానవాటీషు నవోవసన్తః॥ 7

హిమాచలోద్యాన వాటికలయందు స్వకీయ కాంతుల చేత క్రొత్తదగు వసంతమును (కుసుమ ప్రసవసమయమును) కల్పించుచున్న కులాద్రికన్యయగు పార్వతియొక్క మందస్మితములు – త్వ (మ) దీయమగు మనోరథమును సఫలము నొనర్చునుగాత!

**ప్రభ:-** కుల పర్వతములు సప్తసంఖ్యాకములు. అందు హిమాచల మొకటై యున్నది. కావున పార్వతి కులాద్రికన్యయగుచున్నది.

ఉమాహసితమయూఖములు నిత్యసన్నిహితములగుట చేత వసంతమునకు నిత్య కుసుమితో పవనత్వరూపమగు నవత్వము సిద్ధించెడిని.

ఉపవన పంక్తులయందు నిత్యమును అభినవమును అగు వసంత విలాసమును గూర్చుట వలన, ఆహసితమయూఖములకు అమృతాత్మకత్వము (చంద్రత్వము) ధ్వనింపఁజేయఁబడుచున్నది. ఓషధీశుఁడగు చంద్రుఁడు అమృత కిరణుఁడుగదా!

(పార్వతీ హసితమయూఖములు – అమృతాత్మకములు కావున నీ హిమాచల ప్రాంతములందలి ఉపవనములయందు నిత్య కుసుమాకరమగు వసంతమును సృజించినవని భావము.)

''అరోప్యమాణమారోప విషయాత్మతయాస్థితమ్
ప్రకృతస్యోపయోగిత్వే పరిణామ ఉదాహృతః''

''అరోపింపఁబడిన వస్తువు – ఆరోపవిషయరూపమున పరిణమించి ప్రస్తుతార్థమున కుపయోగించునెడల పరిణామమని చెప్పఁబడును'' అను లక్షణమనుసరించి ఇచట నారోప్యమాణములు (గమ్యమానములు) అగుణ అమృతమయూఖములు. ఆరోపవిషయమగు స్మితమయూఖస్వరూపమున పరిణమించి క్రొత్తదగు వసంతమును రచించుటయందుపయోగించుట వలన పరిణామ మలంకారమగుచున్నది.



మూ॥ 'అమ్రేడితం' భూషణచన్ద్రభాసాం
నాసావిభూషామహసాం 'ద్విరుక్తిః'।
పురారినారీ స్మితకాన్తయోమే
పూర్ణానికుర్వన్తు సమీహితాని.॥ 8

శివశిరోలంకారభూతములగు చంద్రకాంతులకు ఆమ్రేడితమును (ద్విస్త్రిరుక్తమును) నాసికాభరణ మణిద్యుతులకు ద్విరుక్తి (పునరుక్తి)యు నగు పురరిపువగు పరమేశ్వరుని యొక్క కాంతయగు పార్వతి చిరునవ్వు మెరుపులు మాయభీష్టములను సిద్ధిపంఁజేయునుగాత!

**ప్రభ:-** భూషణమగు బాలచంద్రుని కాంతులు – పార్వతీస్మిత కాంతులయందు భిన్నవిభక్తి చేత నారోపింపఁబడినవి – కావున నిది వైయధికకరణ్యము చేతనగు రూపకమగుచున్నది.

విషయమునకు – విషయితోడి – అభేదతాద్రూప్యరంజనము – రూపకమనులక్షణము ననుసరించి ఇందు విషయమగు (ఉపమేయమగు) చిరునవ్వు కాంతులకు విషయియగు (ఉపమానమగు) భూషణచంద్ర కాంతులతోడి యభేదతాద్రూప్య రంజనము కాన్పించుచున్నది గదా!

**అవ:-** సర్వజగన్మాంగళ్య సంపాదకములు – సర్వాభీష్టప్రదాయకములు, అగు భగవతీదరహసితముల నిట్లెనిమిదిశ్లోకములచే స్తుతించి – ''నిర్మాయ'' అను క్రింది శ్లోకము మొదలు స్తబకము ముగియువఱకును పరిణయ కల్యాణవార్తలను వర్ణింపఁగోరిన మహాకవి – ఇచట ప్రసక్తమగు తదంగబంధసౌందర్యాదికమును వర్ణించుచున్నాడు.

మూ॥ నిర్మాయవిశ్వాలయ మమ్బ! శర్వ
స్త్వయాసమం శిల్పవిదా స శిల్పీ।
విహర్తుమిచ్ఛన్నయి వోఢుమైచ్ఛ
న్నారీంభవన్తీం పురుషోభవంస్త్వామ్.॥ 9

అమ్మా! సర్వేశ్వరుఁడగు నాశివుఁడు స్వయముగా నిర్మాణకళా విచక్షణుడగు శిల్పియైయున్నాఁడు. నీవును శిల్పమర్మజ్ఞవే యగుచున్నావు. కావున శిల్పజ్ఞవగు నీతోఁగూడి శిల్పవిదుఁడగు నతఁడు మొదట బ్రహ్మాండమను ఆలయమును నిర్మించెను. తరువాత నచట విహరింపఁగోరిన శివుఁడు స్వయముగా పురుషుఁడై స్త్రీ రూపమున జాయమానవగు నిన్నుఁ బెండ్లియాడఁగోరెను.

**ప్రభ:-** అంబాసహచరుఁడగు సర్వేశ్వరుని చేత విహారార్థమగు విశ్వనిర్మాణము నిర్వర్తింపఁబడిన పిమ్మట వారికి, స్త్రీ – పురుషులై – భార్యాభర్తలగుటకు కోర్కె కలిగెను. ఇట్లు విశ్వాలయ నిర్మాణ ప్రారంభికయగు నిచ్ఛ జగన్మాతా పితృత్వబీజ భూత దాంపత్య నిర్వాహిక యయ్యెనని భావము.

ఆలయ నిర్మాణేచ్ఛ – దాంపత్యమును సంఘటించెనని తాత్పర్యము.

మూ॥ దివ్యం దుకూలం ధవలం దధానా
వేణ్యాఫణీన్ద్రోపమయా లసన్తీ।
ప్రఫుల్ల రాజీవ విలోచనాత్వం
ప్రపఞ్చభర్తుర్న యానాన్యహార్షీః॥ 10

దివ్యలోకమునందుదయించినదియు, తెల్లనిదియు అగు వస్త్రమును ధరించి నాగేంద్రునితో సాటియగు వాల్జడతోఁ బ్రకాశించుచు, వికసించిన కమలముల వంటి కన్నులు గల నీవు జగత్పతియగు ముక్కంటి నయనములను సమాకర్షించితివి.

**ప్రభ:-** శివుని యొక్క సోమ – సూర్య– అగ్ని నేత్రములను హరించి (దొంగిలించి) జయించిన నీసరోజనేత్రముల సౌభాగ్యమ నిర్వచనీయమని భావము. 'నయనాని' అను బహువచనము చేత పార్వతీ సందర్శనము వలన హరుని జ్వలన నేత్రము కూడ నిర్వీర్యమయినదని చెప్పఁబడినది. ఇచట నైల్యము – మసృణత్వము – మొదలగు సమాన ధర్మముల వలన వేణీబంధ – భోగీంద్రులకు ఔపమ్యము



చెప్పఁబడినది. పార్వతి ధరించిన పరిధానముయొక్క ధవళిమ – వేణీ నీలిమయొక్క లావణ్యమును పోషించునని గ్రహించునది.

మూ॥ ప్రత్యఙ్గబన్ధం జ్వలదుత్తమంతే
భుజఙ్గ రాజోపమ వేణి - రూపమ్।
అత్మైకనిష్ఠస్యచ విశ్వభర్తు
రారాధయామాస 'విలోచనాని'॥ 11

ముఖ – వక్షోజ – భుజ లతాద్యంగములయందు పరిస్ఫుటమును సర్వలక్షణ లక్షితమును, సర్పరాజోపమ వేణియు నగుచు అంగసౌష్ఠవసంపన్నమగు నీ రూపము – స్వాత్మయందే కేవలమగు దృఢస్థితి గలవాఁడయినను గూడ విశ్వభర్తయొక్క విలోచనములను (మూఁడింటిని) గూడ నారాధించినది. (తృప్తినొందించినది).

**ప్రభ:-** లోకోత్తరమగు సౌందర్యమును జూచుట చేతఁ గలిగిన చల్లఁదనముచేత, అగ్ని రూపమగు తృతీయ నేత్రమునకుఁగూడ శాంతి కలిగెను. నీయొక్క రూపము చేతఁ జేయబడిన యారాధనము – తథావిధమగు శాంతిజనకమని భావము.

మీఁది శ్లోకమున అప్యర్థకము (కూడ అనునర్థము గల) చకారము వలన ఆత్మైకనిష్ఠుఁడగుట చేత – అన్య విషయము లేకుండుట – అనిర్వాచ్యమగు ధీరత – విశ్వ భర్తయగు శివునికి సిద్ధించుచున్నను, తన్నయనాకర్షకమగు లావణ్య సౌభాగ్యము వలన ఉమాదేవీ రూపము – భగవంతుడఁగు హరుని హృదయమునఁ బ్రవేశించి, యతని ధీరతను పెకలించి తన్నయనముల నారాధించెనను నంశము మీఁది శ్లోకమున స్ఫురింపఁజేయఁబడుచున్నది.

విషయవిముఖుఁడును కామదాహియునగు పరమేశ్వరుని నేత్రత్రయమును తృప్తి నొందించుట అర్థసిద్ధి. నయనత్రయతర్పణ రూప పదార్థ నిష్పత్తి కిచట

అసంభావనీయత్వమును వర్ణించుట వలన నిది అసంభవాలంకారమగునని యెఱుంగునది 'అసంభవోఽర్థనిష్పత్తే రసం భావ్యత్వవర్ణనమ్' (అర్థసిద్ధికి అసంభావ్యత్వమును జెప్పుదుమేని అసంభవాలంకారమగును) అనునది తల్లక్షణము.

మూ॥ అభూస్త్వ మాద్యస్య మనోమదాయ
సచాపితే ప్రీతిపదం బభూవ।
నకేవలం వాం సకలస్య చాసీద్
దామ్పత్య బన్ధస్యతదమ్బ! బీజమ్ ॥ 12

అమ్మా! నీ వాది పురుషుని మనస్సును హర్షింపఁజేసితివి. అతఁడు గూడ నీయొక్క ప్రీతికి స్థానమయ్యెను. ఇట్లు పరస్పరమగు మీ ప్రేమ ప్రభావము (కేవలమును) మీ యిరువురి యొక్కయు దాంపత్య బంధనమునకే గాక లోకములందున్న సర్వ ప్రాణులయొక్కయుఁ గూడ దాంపత్య బంధనమునకు బీజమై (కారణమై) యున్నది.

ప్రభ:- సర్వమునకును మూలభూతుఁడును, సర్వ పురుషులకును ప్రథముఁడును, అగుటచేత సర్వేశ్వరుఁ డాది పురుషుఁడైయున్నాడు. ''జాయా చ పతిశ్చదమ్పతీ, తయోర్భావఃదామ్పత్యమ్'' అను వ్యుత్పత్తి చేత భార్యాభర్తృభావము దాంపత్యమని చెప్పబడును.

ఒండొరుల కెడబాటులేని దాంపత్యమే దాంపత్యబంధమని చెప్పఁబడును బీజశబ్దమునకు కారణము, విత్తనము, అను నర్థములు గలవు.

ఉమా - మహేశ్వరుల కొకరియందొకరి కొదవిన ప్రేమ బంధము, మొదట తద్ దాంపత్య సంపాదకమయి, తదుపరి, తత్ఫలితమును జగద్రూపమును అగు



అపత్యమునుండి యేర్పడిన స్త్రీ - పురుష రూపలోకగతమగు దాంపత్యమున కంతకును గారణమయ్యెనని భావము. (శివా) శివులకొదవిన అన్యోన్య ప్రేమ-బీజమని చెప్పఁబడుట వారి దాంపత్యము - వృంతము (తొడిమ) అను నంశము బంధశబ్ద ప్రయోగము వలన ధ్వనింపఁజేయఁ బడుచున్నది.

''ప్రసవ బన్ధనము వృంత'' మని చెప్పఁబడును. వారి దాంపత్యమునకు ఫలము జగద్రూపమగు నపత్యమని యూహింపఁదగియున్నది.

జగద్రూపమగు సంతతి లేని యెడల జగదీశ్వర దాంపత్యమునకు వైయర్థ్యము గాని శైథిల్యముగాని సంభవించెడిని.

భవభూతి యీయంశము నిట్లు చెప్పియున్నాఁడు.

శ్లో॥ ''అన్తఃకరణ తత్త్వస్య దమ్పత్యోః స్నేహసంశ్రయాత్
ఆనన్దగ్రన్థి రేకోఽయమపత్యమితి పఠ్యతే''.

(జాయాపతుల హృదయమునకు, స్నేహమును అవిశ్లేషమును ఫలముగాఁ గలిగిన ఆనందమయమగు గ్రంథి - అపత్యమని చెప్పఁబడును)

ఇచట పరమేశ్వరీ - పరమేశ్వరులకు పరస్పర ప్రేమాధాన రూపమగు నుపకారమువలన అన్యోన్యమను నలంకారమగుచున్నది.

మూ॥ తవాతికాన్తా నయనాన్తవృత్తి -
ర్హాసః పురారేశ్చ నవేన్దుహారీ।
ఉభౌ వివాహోత్సవ పూర్వరఙ్గం
నిర్వర్తయామాసతురాదిరామే! ॥ 13

ఆది సుందరీ! నీ నయనాంతవృత్తి - (కడకంటి చూపులవిలాసము) అత్యంతమును కమనీయ. పురారియగు శివునిహాసము కూడ బాలచంద్రుని

వలెమనోహరము. ఈ రెండును ( ఈ యిద్దఱును) మీ వివాహోత్సవమునకు పూర్వరంగమును నిర్వర్తించినవి. (నిర్వర్తించిరి.)

**ప్రభ**:- సుఖమును పుట్టించునది ఉత్సవము.

''పూర్వమ్ రజ్యతే అస్మిన్నితి పూర్వరఙ్గః'' అను వ్యుత్పత్తిగల పూర్వరంగము విఘ్నములను శమింపఁజేయు కర్మ విశేషమైయున్నది.

ఉమాదేవియొక్క కమనీయ కటాక్ష విలాస రూపయగు వృత్తియు, అర్ధేందుని వలె రమణీయమగు శివుని మందహాసమును మిళితములై నిర్విఘ్నమగునట్లు పాణిగ్రహణమహోత్సవమును నిర్వహించినవని భావము. పూర్వరంగమను పదము చేత- పార్వతీ – పరమేశ్వరోద్వాహము – నాట్యముగా స్ఫురింపఁజేయబడుట నిచట రూపకాలంకారము, ధ్వనించుచున్నదని తెలియనగును. నాట్యశాలయు ఆ నాట్యశాలయందగు రంగ విఘ్నములను తొలఁగించుటకు చేయబడు నాందీ పాఠ- గీత- వాదిత్రాది వివిధాంగకర్మ విశేషమును గూడ- పూర్వరంగమని చెప్పఁబడును.

మీఁది శ్లోకమున ''నయనాన్తవృత్తిః'' అను స్త్రీలింగము యొక్కయు 'హాస్యః అను పుంలింగము యొక్కయు స్వారస్యము వలన పూర్వరంగము నొనర్చు నటీ – నటులు ధ్వనింపఁ జేయఁబడుచున్నారు.

వివాహ కాలమున లజ్జనొందిన నవ వధువునకు నయనాంతవృత్తియు, వరునకు మందహాసమును వర్ణించుట ఔచిత్యపోషక మగుచున్నది.

ఉత్తర భాగమునఁజూడఁబడు ''బ్రహ్మాణ్డ రఙ్గభాజోనట్యాః'' ''శివసూత్రధార సహచర్యాః'' అను శ్లోకము గూడ ఏతత్సజాతీయమని గుర్తించునది.

మూ॥ దాతుం ప్రభుః సాన్త్వయితుం సమర్థః,
కర్తుం క్షమ, స్తర్జయితుంచశక్తః।
సంరక్షతాన్మాం తవసర్వవస్త్యే!
కరస్తుషా రాంశుభృతా గృహీతః. ॥ 14



సర్వ ప్రాణివంద్యవగు జననీ! భక్త లోకమున కభీష్టమును దానము చేయుటకు ప్రభువును, ఆశ్రితులను సంతోషింపఁజేయుటకు సమర్థమును, సర్వతంత్ర స్వతంత్రమగుట వలన దేనినయినను స్వేచ్ఛననుసరించి భేదము చేసైనను సాధించుటకు తగినదియు, శత్రువులను భయపెట్టుటకు శక్తి గలిగినదియు, చంద్రధరునిచేత గ్రహింపబడినదియు నగు నీ హస్తము నన్ను సంరక్షించుగాత!

**ప్రభ**:- మీఁది విశేషణముల వలన ఉమాహస్తము – సామ- దాన- భేద దండోపాయ దక్షమను నంశము తెలియఁజేయఁబడినది. వివాహమున గ్రహింపఁబడుట వలన, రక్షణపరాయణముగా ప్రసిద్ధమగుట వలనను గూడ నిచట విశేషింపబడినది. దేవీ దక్షిణహస్తమే యగుచున్నది. సర్వేశ్వరుని చేత గ్రహింపఁబడిన హస్తమునకు సామాది సామర్థ్యము స్వారస్యావహమని యెఱుంగునది. ఒక్కటియే యగు హస్తమునకిట్లు దాన – సాంత్వన – కర – తర్జనముల నుల్లేఖించుట వలన నిచటనుల్లేఖ మలంకారమని గ్రహింపనగును.

మూ॥ స్ప్రష్టుం నశక్యా పరమేవరైస్త్వం
సచాన్య యాచిన్తయితుం నశక్యః।
త్వమేవశర్వస్య సఏవతేఽమ్బ
దామ్పత్యమేవం యువయోస్తుసత్యమ్॥ 15

అమ్మా! నీవే ఉత్తమురాలవు. ఈశ్వరునికంటె నితరులు నిన్ను స్పృశింపఁజాలరు. నీకంటె నితరులతనిని గూడ చింతింపఁజాలరు. శర్వునకు నీవే యున్నావు. (అన్య స్త్రీ లేదు) నీకతఁడే యున్నాఁడు (అన్యుడు లేఁడు) కావున ఇట్లు మీయొక్క (శివశక్తుల యొక్క) దాంపత్యమే సత్యము. (తదితరమగు దాంపత్యము సత్యముకాదు)

**ప్రభ**:-ఇచట శివ-శక్తుల దాంపత్యము – అన్యోన్యాత్మకము – అవియోజ్యము ( ఎడబాటులేనిది) అని చెప్పఁబడినది.

కావున సత్యమగు నీదాంపత్యము – అవికారి (మార్పులేనిది) అగును. తదితరము– అవికారి కానేరదు.

పరమార్థమున శివశక్తుల దాంపత్యమొక్కటియే సత్యము. పుం, జాతియంతయు – శివమూలము.

స్త్రీజాతియంతయు శక్తిమూలము. కావున లోకమునందు తదితరములకు దాంపత్యములన్నియునుగూడ తద్వివర్తములే (సత్యమగు నాదాంపత్యమునందు కల్పితములే) యని తెలియునది.

మూ॥ నిజాద్ వతం సేన్దుత ఇన్దుమన్య
ముత్పాద్య తే శమ్భు రదాద్వతంసమ్।
మూర్తామివాసౌ శుభగాత్రి! రాత్రిం
ప్రాప్య త్వదీయాం కబరీం చకాసే. ॥ 16

శుభగాత్రివగు (మంగళాంగివగు) జననీ! శివుడు నిజశిరోఉలం కారభూతమగు చంద్రుని నుండి వేరొక చంద్రుని సృజించి నిన్నలంక రించెను. భూషణరూపుఁడగు నాచంద్రుఁడు నీకేశ వేశమును రూపొందిన రాత్రినివలె నాశ్రయించి మిగులఁ బ్రకాశించెను.

**ప్రభ:**– వివాహ కాలమున నవ వధువునలంకారము నొసంగుట సంప్రదాయ సిద్ధము. కావుననే పరిణయ సమయమున వరుఁడగు శివుఁడు స్వాత్మ శిరోభూషణము నుండి వేఱొక భూషణమును సృజించి వధువగు పార్వతికి శిరోభూషణము గాజేసెనని భావము.

ఇచట నైల్యసాధర్మ్యమువలన పార్వతీక బరికి నిశా– తాత్పర్యము సంభావింపఁబడినది. కావున నిది స్వరూపోత్ప్రేక్ష యగును. చకాసే (బభాసే) అనుచోట శివుని పిశంగ జటాగతభూషణము కంటె, పార్వతీ నీలకబరీగత భూషణము యొక్క – 'భాసనాతిశయము' స్ఫురింపఁజేయఁబడుచున్నది.



మూ॥ బభూవిథాగేన్ద్ర గృహేయదాత్వం
సచేశ్వరస్తత్ర చకార వాసమ్।
విలోకమానస్తవదేవి! విద్యుత్
పాఞ్చాలికాయాః కమనీయభావమ్. ॥ 17

దేవీ! (బాల్యమున) పర్వతరాజగు తండ్రియింట నీవు నివసించుచున్నప్పుడు విద్యుత్పాంచాలికవగు (జాజ్వల్యమానమగు మెరుపుతో జేయఁబడిన యాటబొమ్మవలెనున్న) నీయొక్క రామణీయకమును విలోకించుచు, నాయీశ్వరుడు కూడ నచ్చటనే నివసించియుండెను.

**ప్రభ:**– ఇందలి విద్యుత్పదము చేత – జ్యోతిరుజ్వల రామణీయక సంపన్నము – హరనయనాకర్షకమును అగు – తన్వీత్వమును (సూక్ష్మస్థితి) గమింప, జేయఁబడుచున్నది. ఇది స్వతస్సంభావితమగు వస్తుధ్వని.

మూ॥ సిద్ధం స వాం సాధయితుం ప్రవృత్తో
యోగం ప్రదగ్ధో మదన శ్చకల్పే।
'వశీతి' కీర్తిం గిరిశస్యభర్తుం
తుభ్యం 'త్వపర్ణే' తి మశశ్చకర్తుమ్. ॥ 18

ప్రసిద్ధుఁడగు నామన్మథుఁడు, నిత్యసిద్ధమగు యోగమును అనఁగా శివ–శక్తి దాంపత్యరూపమగు సంబంధమును సాధించుట కుపక్రమించి శివనేత్రాగ్ని చేత భస్మముగాఁ జేయబడి – శివునకు వశి (జితేంద్రియుఁడు) అను కీర్తిని పోషించుటకును, శివునందలి ప్రణయము వలన తపస్సు నాచరించునపుడు, పర్ణములను (ఎండినయాకులను) గూడ భుజింపకుండుట వలన నీకు 'అపర్ణ' అను యశమును గలుగఁజేయుటకును సమర్థుఁడయ్యెను. ప్రియలాభము కొఱకు మిక్కిలి కష్టమగు తపస్సు నాచరించిన పార్వతికి 'అపర్ణ' అనునామము ప్రసిద్ధము.

మహా కవియగు కాళిదాసు–

''స్వయం విశీర్ణ ద్రుమపర్ణవృత్తితా
పరాహికాష్ఠా తపసస్తయాపునః
తదప్యపాకీర్ణమితి ప్రియంవదాం
వదన్త్యపర్ణేతి చ తాం పురావిదః''

స్వయముగా రాలి – యెండిన యాకులను భుజించుట – తపస్సునకు పరాకాష్ఠ యగుచుండును. అట్టి పర్ణములను ( ఆకులను) గూడ విడుచుట వలన ప్రియంవదయగు పార్వతిని – పురావిదులు – 'అపర్ణ, అని చెప్పుదురు.''

అని స్వకృతకుమార సంభవమున పంచమసర్గమందలి పదునెనిమిదవ శ్లోకమునఁ జెప్పియున్నాఁడు.

ఇచట సిద్ధమగు పార్వతీ – పరమేశ్వర యోగమును సాధించుటకయిన మన్మథుని ప్రవృత్తి – హేతువు, శివునకు వశియనుకీర్తిని సంధించుటయు, ఉమకు – అపర్ణయను యశమును గలిగించుటయు ననునవి హేతుమంతములు (కార్యములు).

ఇట్లు హేతుమంతముతోఁ గూడ హేతువును వర్ణించుట వలన నిది హేత్వలంకారమగుచున్నది. చంద్రాలోకమునందిట్లు చెప్పబడినది.

''హేతోర్హేతుమతాసార్ధం వర్ణనం హేతురుచ్యతే
అసావుదేతి శీతాంశుర్మానచ్ఛేదాయ సుభ్రువామ్''

హేతువును హేతవంతముతో ఁగూడ నొకేవాక్యమున వర్ణించుట హేత్వలంకార మనఁబడును. హేతువువలన నగు కార్యము హేతువంతమని చెప్పఁబడును.



ఉదా:– ''చక్కని కనుబొమలు గల కాంతలమానమును (కోపమును) ఛేదించుటకీచంద్రుఁ డుదయించుచున్నాఁడు.

19

మూ॥ ఘోరం తపశ్చే ద్రచితంత్వయాఽపి
ప్రా గ్రూపభర్తుః సమనుగ్రహాయ।
విహాయ యత్నం క ఇహాఖిలామ్బ
సమ్బద్ధమప్యర్థ ముపైతుజన్తుః॥

ఓ సర్వలోక జననీ! పూర్వ రూపమున (సతీదేవిగా నున్నపుడు) నీకు భర్తయగు నీశ్వరుఁడు నిన్నంగీకరించి యనుగ్రహించుటకొఱకు నీవు కూడ, నిరశనవ్రతసాధ్యమగు ఘోరతపము నొనర్చు నెడల ఈ లోకమునందున్న జంతువెవ్వఁడైనను ప్రయత్నమును విడిచి – సిద్ధము గాని సాధ్యముగాని యగుచు సంబంధించియున్నను స్వాభీష్ట విషయము నెట్లు పొందును?

ప్రభ:- పూర్వము సిద్ధించిన భర్త యొక్క అనుగ్రహము కొఱకు జగన్మాత యగు పార్వతికిఁగూడ తపశ్చరణ మావశ్యకమగు నెడల ఆయమ్మకంటె వేరయిన అల్ప జంతువునకు ఇష్టార్థ లాభము కొఱకు ప్రయత్న మత్యంతావశ్యకమను నంశమును వేరుగా చెప్పనక్కఱలేదని భావము.

''కైముత్యేనార్థ సంసిద్ధిన కావ్యార్థాపత్తి రిష్యతే'' (కిముత' శబ్దము యొక్క భావము కైముత్యము. కైముతిక న్యాయము చేత నర్థసంసిద్ధి – కావ్యార్థాపత్తియనబడును.

అను లక్షణము చేత నిచటి యలంకారము కావ్యార్థాపత్తియని తెలియునది. ఈ యంశమున క్రింది యదాహరణమును గ్రహించునది.

''ప్రేయసీ! నీముఖమా చంద్రునే జయించినది. పద్మముల మాట చెప్పనేల''

**వి వ:-** ఆ చంద్రుడన, పద్మములను జయించిన చంద్రుఁడని యర్థము. పద్మములను జయించిన చంద్రునే నీముఖము జయించినది. ఇఁక పద్మములను జయించెనని చెప్పవలయునా?'' అనఁగా పద్మములను మిక్కిలి సులభముగానే జయింపఁగలదని యర్థము.

ఇట్లు కైముత్యము చేత అర్థ సంసిద్ధివలన నిది కావ్యార్థాపత్తి యగుచున్నది.

మూ॥ జ్వలత్ కపర్దో, దహనాఙ్కభాలః
కపాలమాలీ, కరికృత్తి వాసాః।
భుజఙ్గభూషో, భసితాఙ్గరాగః,
పుష్పేషువైరీ, పరుషాట్టహాసః॥ 20

మూ॥ శ్మశానవాసీ, పురుష, త్రీ శూలీ,
జహార తేచేదన ఘూఙ్గి! చేతః।
దృష్టాన్తమర్థోఽయ మవాపన్నైవ
ప్రీతిర్బహిః కారణమాశ్రతేతి. ॥ 21

జ్వలించుచున్న జటాజూటమును, దహనాంకమగు (నిప్పుతోఁగూడిన) ఫాలస్థలమును, కపాలమాలయు, (తల పుఱ్ఱెల దండయు) గజ చర్మ వస్త్రమును (ఏనుఁగుతోలు కట్టుబట్టయు) సర్పభూషణములును, భస్మాంగరాగమును (బూది పూతయు) గలఁవాడును పుష్ప బాణుఁడగు మన్మధునకు, శత్రువును, కర్కశమగు పెద్ద నవ్వుగలఁవాడును.

· శ్మశానమునందు (పితృ వనమునందు) నివసించువాఁడును, త్రిముఖమగు త్రిశూలము గలవాఁడును, అగు పురుషుఁడు. అనవద్యాంగివగు (నిర్దుష్టములగు నవయవములు గలిగిన) నీ మనస్సు నాకర్షించినపుడు ప్రీతియనునది – బాహ్యోపాధి నాశ్రయించి ప్రవర్తింపదను నర్థము దృష్టాంతము నొందుచున్నది. (ప్రీతికి బాహ్యగుణము కాన్పింపదు.)



**ప్రభ:-** ప్రీతి- బాహ్య కారణవము నాశ్రయింపదను ప్రసిద్ధ మగు నభిప్రాయమునకు నిదర్శనమున్నదని భావము. ఇట్లనుట చేత ప్రేమకు అంతరమే యగు హేతు వేదో కలదను నంశము స్పష్టముగా నవగమింపఁజేయఁబడుచున్నది. ఈ యర్థమును

''వ్యతిషజతి పదార్థా నాన్తరః కోఽపిహేతుః
నఖలు బహిరుపాధీన్ ప్రీతయః సంశ్రయన్తే''

చెప్పుటకు వీలుపడని యేదో అంతరమగు హేతువు అంతఃకరణాదులగు పదార్థములను, అన్యోన్యలగ్నములుగాఁ జేయుచుండును. ప్రీతులు – బాహ్యములగు హేతువులను (స్వోత్పాదకములుగా) అపేక్షించునవి కావు.

అని భవభూతి మహాకవి కూడ ఉత్తర రామచరితమునఁ దెల్పియున్నాఁడు.

మీది శ్లోకమున 'పుష్పేషువైరీ' అనుచోట 'పుష్పౌఘవైరీ, అను పాదముగూడ నున్నది. పుష్పౌఘవైరియన మదన బాణభూతమగు పుష్ప సమూహమునకు శత్రువని యర్థము. శృంగారాంగ భూతమగు పుష్ప సమూహముతోడి వైరము కామారియగు శివుని వైరాగ్య ప్రసిద్ధిని సూచించునని తెలియునది.

మీఁది శ్లోకమున అతి ఘోరములును జుగుప్సావహములును నగు, జటాజూట– నేత్రజ్వలన – కపాలమాలాదులతోఁ గూడిన వాఁడును, శృంగార ధ్వంసియు, వికృత వేషుఁడును అగు పురుషుఁడు – సర్వలక్షణ సంపన్నములగు నంగములు గల నిన్నా కర్షించెనను ప్రకృతార్థము చేత ప్రీతి – బహిఃకారణము నాశ్రయింపదనుటకు దృష్టాంతము గలదను నప్రకృతమగు నర్థము సమర్పింపఁబడుట చేత – నిచటి యలంకార మర్థాంతర న్యాసమగుచున్నది.

మూ॥ రూపంపురారే రథవాత దేతత్
సేయం చ చేష్టా సమయాన్తరేషు।
కాన్తంవపుః కాన్తతరాశ్చ లీలా
స్త్వయానమం ఖేలితు మేషధత్తే. ॥ 22

పురారియగు మహేశ్వరునకు పూర్వోక్తమగు జ్వలించుచున్న జటాజూటము గలిగియుండుట మొదలగు రూపమును, శ్మశానమునందు నివసించుట మొదలగు చేష్టయు, పార్వతితో విహరించు సమయమునందుఁ గాక తదితరములగు సమయములందుండెను.

భగవంతుఁడు పార్వతితో విహరించుటకు కమనీయమగు శరీరమును మిక్కిలి కమనీయములగు లీలలను ధరించుచుండెను.

( ద్వాదశస్తబకమున ''ముక్త భోగి కట కేనపాణినా'' అని యారంభించి, పార్వతీ పరమేశ్వరులకు శృంగారమును వర్ణించునపుడీ యంశమును చెప్పఁబడును.)

మూ॥ ప్రహృష్టయక్షః సమవేతసిద్ధో
నృత్యద్గణేన్ద్రో వికసన్మునీన్ద్రః।
భూయోఽపియోగో యువయోర్హిమాద్రౌ
బభారమాతర్మహ మద్వితీయమ్. ॥ 23

మాతా హిమాచల నివాసులగు యక్షులను ప్రహర్షింపఁజేసి నదియు, సిద్ధపురుషులను సమ్మిళితుల నొనర్చినదియు, ప్రమథగణ శ్రేష్ఠులను నర్తింపఁజేసినదియు, మునీంద్రులను వికసింపఁజేసినదియు నగు మీ పునస్సమాగమము - ఆహిమాద్రియందు - అద్వితీయమగునుత్సవమును పోషించెను.

ప్రభ :- యక్షులనఁగా దేవయోని విశేషులు. పార్వతీ- పరమేశ్వరుల కిపుడు జరిగిన సమాగమము, సతీభవ సమాగమముకంటె, వేఱగుట వలన పునస్సమాగమమగు చున్నది. వెనుక సతీ- భవులకు సమాగమముండెను. తత్ సతీ- రూపయగు పార్వతికి శివునితోడి సమాగమము ( కలయిక) మరల నిపుడు కలుగుట వలన నిది వారి పునస్సమాగమమని చెప్పఁబడినది.



మీఁది శ్లోకమున ''ప్రహృష్టయక్షః'' అనుటకు మారు ''ప్రహృష్టపక్షః'' అను వేరొక పాఠమున్నది. అపుడు, పార్వతీ పక్షమగు హిమవద్బంధువర్గమును, శివ పక్షమగు ప్రమథగణ యక్షరాజాదికమును, ప్రహర్షింపఁజేసినదను నర్థమును గ్రహింపవలయును.

మూ॥ మహేశ్వరస్త్వాం పరిణీయ లేభే
యావాత్మజౌ ద్వావనఘాఙ్గి! ముఖ్యౌ।
ఏకస్త యోర్భ్రామ్యతి విశ్వమత్తుం
భూభృత్తటీరాశ్రయతే బతాన్యః ॥ 24

అనవద్యాంగివగు ( దోష రహితమగు విగ్రహము గల) పార్వతీ! మహేశ్వరుఁడు నిన్ను పరిణయమాడి ముఖ్యులగు నాత్మజుల నిద్దఱిని గాంచెను. వారిలోనొకఁడగు గణపతి - విశ్వమును భుజించుటకై తిరుగుచున్నాఁడు. పాపమింకొకడు (స్కందుఁడు) పర్వతభూముల నాశ్రయించి యున్నాఁడు.

ప్రభ:- భుక్తి ప్రియుఁడనియు, లంబోదరుడనియు ప్రసిద్ధుఁడగుట వలన గణపతి విశ్వమును భుజించుటకై తిరుగుచున్నాఁడని చెప్పఁబడినది. నగరంధ్ర కృత్తు, గుహుఁడు, మొదలగు నామముల చేత స్కందుఁడు- పర్వత మహావాసి అనునంశము ప్రఖ్యాతమగుచున్నది - గణపతిముని - రమణ మహర్షులు. వీరేయని సూచితము.

ఇట్లు - ఒకడు భ్రమణ శీలుఁడును, ఇంకొకడు పర్వతగుహావాసియు నగుట వలన మీయత్మజులిద్దఱును గూడ సుఖజీవనులు కారనునంశము 'బత' (అయ్యో) అను పదముచేఁ దెలుపఁబడుచున్నది. ప్రభావ్యాఖ్యాత 'బత' అనునది విస్మయార్థకము మని వచించెను. జగత్కుటుంబులగు పార్వతీ పరమేశ్వరులు దేవాసుర మానవాది సకల జనకులగుచున్నారు. అయినను, ఆయాత్మజులయందు స్కంద- గణపతుల విశిష్టతను స్ఫురింపఁజేయుటకు వారు ముఖ్యులని చెప్పఁబడిరని గ్రహించునది.

మూ॥ సజ్జీ్ర్తయన్త్వో, జగతాంతజనన్యాః
కల్యాణవార్తాః కమనీయకీర్తేః।
ఇమాః ప్రమోదాయ సతాంభవన్తు
సన్దర్భశుద్ధా ఉపజాతయోనః॥ 25

రమణీయ కీర్తియగు జగజ్జనని యొక్క కల్యాణవార్తలను సంకీర్తన మొనర్చునవియు, సందర్భ శుద్ధములయినవియు, నిట్లు రచింపఁబడి నవియు నగుమాయీ – ఉపజాతులు సజ్జన ప్రమోదదాయకములగుఁగాత.

ప్రభ:- సందర్భమనఁగా, నిబంధింపఁబడిన పదవాక్య గుంఫన రూపమగు రచనము, శుద్ధములనఁగా, పద –పదార్థ – వాక్య – వాక్యార్థదోష రహితములు. ఉపజాతులనగా, ఉపజాతివృత్త నిబద్ధములగు శ్లోకములు.

'ఇది సవ్యాఖ్యమగు పంచమస్తబకము'
ఓమ్ – తత్ – సత్ –

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ
శ్రీ భారతీ దేవ్యై నమః

# ఉమా సహస్రము

## (ద్వితీయ శతకమున – ద్వితీయస్తబకము)

### ఆరవ స్తబకము

**అవ :-** ద్వితీయ శతకము యొక్క ద్వితీయ స్తబకమగు నిందు – దేవి యొక్క 'విశ్వవైభవ సంపత్తి' స్తుతింపఁబడును.

మూ॥ హర్తారః శశికీర్తేః
కర్తారో నవభాసామ్।
భర్తారో మమసన్తు
స్కన్దామ్బాదరహాసాః॥ 1

చంద్రునకుఁగల ఖ్యాతిని హరించునవియు, క్రొత్తక్రొత్తలగు కాంతులను కలిగించునవియు, నగు స్కందాంబ (పార్వతి) యొక్క మందహాసములు నన్ను భరించునవియగుఁగాత!

**ప్రభ:-** ఆహ్లాదకత్వాది గుణములచే – అమృతకిరణుని యశమును గూడ నతిశయించునవియు, నవనవ వికాసముచే విలసిల్లునవియు, ( ఆశ్రితులకు అభినవాభ్యుదయమును గలిగించునవియు) అగు పార్వతి మందస్మితములు – భక్తుఁడనగు నన్ను పోషించును గాతయని యభ్యర్థనము కావింపఁబడినది.

మూ॥ దిగ్వల్లీష్వతి శుభ్రం
కుర్వన్తః కుసుమర్ధిమ్।
భూయాసుస్తవ భూత్యై
మన్మాతుః స్మితలేశాః॥ 2